కథ

# డబుల్ మీనింగ్

— అడపా రామకృష్ణ

**వాహిని రాజీనామా చేసిందా? నమ్మలేని నిజం. పోస్ట్‌లో వచ్చిన రిజిష్టర్ లెటర్ చూసి చదివేదాకా ఆఫీస్ స్టాఫ్ ఎవ్వరూ నమ్మలేదు. తీరా చదివేక అవాక్కయ్యారు.**

వాహిని గవర్నమెంట్ జాబ్‌లో చేరి నెల రోజులైనా కాలేదు అప్పడే రిజైన్ చేయడమా? మొదటి నెల జీతమైనా తీసుకోలేదు. అంత లోనే అంత నిరాశా, నిస్పృహా కలిగాయంటే ఇదేదో తీవ్రంగా ఆలోచించ వలసిన విషయమే.

ఆఫీసులో పని భయం లేదు. డిగ్రీ చదివింది. డ్రాఫ్టింగ్ వచ్చు. టైపింగ్ లోయర్ ప్యాసైంది. ఏడాది పాటు నేర్చుకున్న కంప్యూటర్ పరిజ్ఞానం వుంది. అన్నీ వుండి అంత అనాలోచితంగా జాబ్‌ని లెక్క చేయకుండా వదిలేసిందంటే మరేదన్నా బెటర్ ఆపర్చ్యునిటీ వచ్చిందా? లేదు! అదేం కాదు.

మరింకేదో అయి వుంటుంది. ఆమెనెవరైనా అవమానించారా? సహచరులైన స్నేహితురాళ్ళు న్నారు. వాళ్ళామెను తప్పకుండా ప్రొటెక్ట్ చేస్తారు.

వాహిని ఎంతో కాలంగా తిరిగి తిరిగి ప్రయ త్నించిన జాబ్ ఇప్పటికి అదృష్టవశాత్తూ దొరికింది. రిటైర్‌మెంట్‌కి దగ్గరపడిన తండ్రి చిన్న ఉద్యోగం చేయలేక సతమతమవుతున్నాడు. తల్లి జబ్బుకే ఎక్కడలేని డబ్బూ చాలడం లేదు. చెల్లెలు, తమ్ముడి చదువులింకా పూర్తి కాలేదు. వాహిని తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం చేయవలసిందే. అన్నీ తెలిసి, లోకజ్ఞానం వున్న అమ్మాయి హఠా త్తుగా ఉద్యోగానికి నీళ్ళొదులుకుందంటే చాలా బలమైన కారణమే వుండి వుండాలి. ఇంత శీఘ్ర నిర్ణయం వెనుక వున్న బలమైన కారణ మేమిటో డిపార్ట్‌మెంట్‌లో వున్న స్టాఫ్ ఎవరికీ అర్థం కాక తలలు పట్టుక్కూర్చున్నారు.

ఆరోజు సాయంత్రం వాహిని ఆఫీస్ కొలీగ్స్ సూరిబాబు, కనకరాజు, నరసింహం, భాను, విమల, సాజీ, రజనీ అంతా కలసికట్టుగా వాహిని ఇంటికి బయలుదేరారు. సానుభూతి చూపడానికి కాదు. ఆమెను ఎలాగైనా ఒప్పించి, రాజీనామా లేఖను విత్‌డ్రా చేయించి తిరిగి జాబ్‌లో జాయిన్ చేయించడానికి సమష్టి కృషి చేయాలనుకున్నారు.

వాహిని తన ఇంటికి వచ్చిన వారందర్నీ ఆద రణ పూర్వకంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది. లెమెన్ స్క్వాష్ కలిపి ఇచ్చింది. అందరూ మౌనంగా కూర్చుని మెల్లగా అసలు విషయం కదిపారు.

**"మేడమ్! మీరెందుకు జాబ్‌కి రిజైన్ చేశారో తెలుసుకోవచ్చా?"**

**"అంత సడన్‌గా రాజీనామా చేశారంటే కారణం?"**

"ఇంతకన్నా మంచి జాబ్ ఏదన్నా వచ్చిందా?"

"ఆఫీసులో ఏదన్నా ప్రాబ్లమ్ ఫేస్ చేశారా?"

అంతా తలా ఓ ప్రశ్న వేస్తున్నారు. అందరూ అలా అడగ్గా, ఒక్కమారు అందరివైపు తీక్ష ణంగా చూస్తూ–

"మీ ప్రవర్తన, మాటతీరూ భరించలేక రిజైన్ చేశాను. నాలాంటి వాళ్ళెవరైనా అదే పని చేస్తారు" అంది ఎంతో దుఃఖాన్నీ, కోపాన్నీ దిగమింగుకుంటూ".

ఆ మాటకి అంతా హడలిపోయారు. అందరి గొంతుకల్లో తడారిపోయింది. వారి ముఖాలు వివర్ణమయ్యాయి. విశ్చేష్టులయ్యారు.

"మా తప్పేమిటో వివరించండి. దిద్దు కుంటాం. అదేమిటో చెప్పకుండా ఎలా తెలు స్తుంది" అన్నారు ఒకరిద్దరు ఉక్రోషంగా. మిగ తావారంతా అవునన్నట్టు తలలాడించారు.

ఆమె సావధానంగా చెప్పడం మొదలుపె ట్టింది.

ఆరోజు మీరంతా మాటిమాటికి ఎందుకో నవ్వులు, కేరింతలు, ఒకరినొకరు ఆటపట్టించు కుంటూనే వున్నారు.

రజనీ సీటు వద్దకు వచ్చి ప్యూన్ వచ్చి 'మేడమ్ మీ డ్రాయరులో ఇంకో ప్రాడ్ వుంది. ఒకమారిస్తారా?' అని అడిగాడు. అంతా గొల్లున నవ్వారు. ఆమె బిత్తరపోయి కొంచెం చిరు కోపం ప్రకటిస్తూ 'డ్రాయర్‌లో కాదు డ్రా అను! తెలిసిందా' అంది. అంతగా విరగబడి నవ్వడానికి ఇదీ ఒక జోకేనా అనిపించింది.

మధ్యాహ్నం అందరం లంచ్ తీసుకుం టున్నాం. ఎవరెవరు ఏం తెచ్చుకున్నా కొంచెం కొంచెం సర్దుకోవడం ఎప్పుడూ వున్నదేగా.

'మీదేం కర్రీ' అని భాను అడిగింది కనక రాజుని. "ములక్కాడ పులుసు. వంకాయ వేపుడు' అన్నాడతను.

'చాలా జోరు మీదున్నారే!' అంది సాజీ కలువుగోలుగా.

'మీ ఆయనకి వండిపెట్టకూడదా, తడాఖా చూపిస్తాడు' అన్నాడు సూరిబాబు మరింత రెచ్చిపోతూ.

'ములక్కాడ రుచి మరిగే నలుగుర్ని కన్నారు. తీరా ఇంక్రిమెంట్ లేకుండా పోయింది" అంది భాను వెటకారంగా నవ్వుతూ.

గుంభనంగా అంతా ఒక్కసారి నవ్వారు. ఆ తరువాత చిల్లుగారె, అరటి పండు చూపిస్తూ పెడార్థాలు తీశారు. భోజనం సహించక లేచి వెళ్ళిపోయాను.

ఉదయం అందరితో పాటు అటెండెన్స్ రిజి స్టరులో సంతకం చేయడానికి నిల్చున్నాను. ఒకరినొకరు కళ్ళతోనే పలకరించుకున్నారు.

'కళ్ళేమిటి ఎర్రగా వున్నాయి' విమల భాను వైపు చూస్తూ అడిగింది.

'అర్ధ రాత్రి కరెంటు పోయిందే, నిద్ర పట్ట లేదు' అంది భాను.


'అంతేనా, నిద్ర పట్టనివ్వలేదా' మెల్లగా గొణి గాడు నరసింహం.

అందరూ పకపకలు, వికవికలు. అక్కడ సిగ్గుతో తలదించుకున్న దాన్ని నేనొక్కర్తినే అనుకుంటా.

ముందుగా ఇన్‌ఛార్జి సంతకం చేసి ఇచ్చాడు.

'భామా నువ్వు పెట్టవే' అంది విమల కిసు క్కున నవ్వుతూ.

'వాది కింద వుందే! ముందు నరసింహం గారు పెడతారు' అంది రిజిష్టరు అఆయన ముందుకు తోస్తూ.




'దొరికినప్పుడు పెట్టేయడమే! క్రిందామీదా చూస్తారేం?" అంటూ కనకరాజు దురుసుగా ముందుకొచ్చాడు.

'ముందో, వెనుకో అంతా రోజూ పెడుతున్నాంగా' అంటూ ఇన్‌ఛార్జి విరగబడి నవ్వాడు.


'నామీద మీరు పెట్టండి' అంది రజని కనకరాజు వైపు చూస్తూ.

ప్రతి రోజూ కొత్త కొత్త సంభాషణలు, విపరీతార్థాలూ వీనులవిందైనట్టు అంతా పరవశించి పోవడం. మూగబాధతో విలపించేది నేనొక్కదాన్నే.

మరొక రోజు సూరిబాబు సప్లిమెంటరీ బిల్లు నా టేబుల్ మీద పెట్టి రెవిన్యూ స్టాంపు అతికించి అది సరిగ్గా అంటిందో, లేదో నన్నట్టు గట్టిగా అంతా వినేటట్టు రెండు గుద్దులు గుద్దాడు. అది చూసి కనకరాజు అంతా వినేటట్టు-

'పెట్టగానే అంటుకుంటుదిగా అలా చితక బాదితే గాని శాటిస్‌ఫేక్షన్ వుండదా నీకు' అని అరిచాడు.

దానికి అందరూ కేరింతలు కొట్టి నవ్వడం, అంది ఎంతవరకు సభ్యతగా వుందో ఆలోచించినవారు లేకపోవడం, నేను ఒక్కర్తినే ఒంటిపిల్లి రాకాసినయ్యాను.




ఒకనాడు సౌజీ ఒంటినిండా రకరకాల బంగారు నగలు నిండుగా పెట్టుకొచ్చింది. అంతా గుమిగూడి 'ఆమె ఒంటిమీద బంగారమంతా ఎన్ని తులాలు వుంటుందో చెప్పండి చూద్దాం!' అని చిన్న క్విజ్ క్వశ్చన్ వదిలింది విమల.

దానికి నరసింహం రెచ్చిపోతూ 'పైకి కనిపించే బంగారం ఎంతో చెప్పడం కష్టమైన పనా? లోపల కనపడని బంగారం ఎంత వుందో అదెలా చెప్పమంటారు?' అన్నాడు. సరసంగా అధిక తెలివితేటల్ని ప్రదర్శించాడని నరసింహానికి జేజేలు కొట్టారు. ఆడవాళ్ళంతా అతణ్ణి తెగ మెచ్చుకున్నారు. కోరస్‌లా అదే పనిగా అందరూ పడీపడీ నవ్వడంతో నాకు పిచ్చెక్కినంత పనైంది.

టైప్ రైటర్ మీద లెటర్ కొడితే మిస్టేక్ దొర్లింది. వైట్ ఫ్లూయిడ్ పెట్టమన్నారు రజనీగారు. అది అడిగితే విమలగారు ఏమన్నారో తెలుసా!– 'అవ్వడే ఎలా వస్తుంది ఆవిడకి, నరసింహం గారి దగ్గరైతే రెడీగా దొరుకుతుంది' అందామె. దానికి నరసింహం– 'నా దగ్గరున్నది డ్రై అయిపోయింది' అంటూ సమయస్ఫూర్తిగా చెప్పి తప్పించుకున్నారు. ఆమాటకి డబుల్ మీనింగ్ ఎప్పటికో గాని అర్థం కాదు.

ఆఫీసరు గారొచ్చి, భానుని అడిగారు– 'పేమెంట్స్ ఎప్పుడు చేయాలి? రేపు చేయాలా?' అని.

ఆమె 'రేప్ చేయండి' అంది అనాలోచితంగా. వెంటనే పక్కనే వున్న సూరిబాబు–

'అందిరికీ చేస్తారా రేపు' అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చాడు, అమాయకంగా నటిస్తూ. అందులో మిళితమై వున్న విపరీతార్థం జీర్ణించుకుని విరగబడి నవ్వారు.

జెరాక్స్ మిషన్ ఆపరేషన్ ఎలాగో నేర్పుతానని ప్యూన్ అందరితో సెక్సీ వర్డ్స్ కాంబినేషన్‌తో చెప్పాడు. 'మిషన్‌ని వేడెక్కించండి. పై కవరు లేపి పేపరు బోర్లించి మూయండి. పైనున్న రెండు బ్లాక్ బటన్స్ ప్రెస్ చేయండి. పేపర్ని దానంతటదే లోనికి లాక్కుంటుంది. ఆటోమేటిగ్గా ప్రింట్ పడి డెలివరీ అయిపోతుంది' అంటూ అందర్నీ వెర్రెక్కించాడు.

ఇలా ఇంకా ఎన్నో ఎన్నెన్నో రోజూ వినీ వినీ నా మనసు చిన్నాభిన్నమవుతోంది. ఆఫీసులో ఎంతో ప్రశాంతంగా చక్కగా పనిచేసి అధికారుల మెప్పు పొందాలని వచ్చిన నాకు అడుగడుగునా కలుషిత వాతావరణంలో ఒక్క క్షణం కూర్చోవాలనిపించటం లేదు.

ఆ నాలుగు గోడల మధ్య ఆఫీసులో ఏదో సరదాగా కబుర్లు చెప్పకుంటూ పని చేస్తారనుకున్నాను గాని స్త్రీ పురుష తారతమ్యం లేకుండా ఒకరినొకరు సరస సంభాషణలతో ఆట పట్టించుకోవడం ఎంతో అసభ్యంగా తోచింది. ప్రతి మాటలో, పనిలో శృంగారాన్ని జత కలిపి చిలిపి వ్యాఖ్యానాల ప్రేరణతో అష్టావధానం, శతావధానం చేస్తున్నట్టు ఏదో ఆనందం, అనుభూతికి లోనుకావడం ఎంతో ఎబ్బెట్టుగా తోచింది. నేను ఈ అసభ్య వాతావరణంలో ఎంతో కాలం నిలదొక్కుకోలేను. అందుకు నా మనసు అంగీకరించలేదు. ప్రతిరోజూ మనసుని చంపుకుని ఆ ఉద్యోగం చేయలేను. మనశ్శాంతిగా ఏ ప్రైవేటు ఉద్యోగమైనా ఫరవాలేదు. దొరక్కపోదు. మీ మనసుల్ని కష్టపెడితే, బాధపెడితే క్షమించండి. మీ తాత్కాలిక ఆనందం కోసం నన్ను నేను ఆత్మక్షోభ పెట్టుకోలేను" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది వాహిని.

అందరి మనసులు చిన్నాభిన్నమైపోయాయి. ఏదో సరదాగా, ఒకిరొకరు కవ్వించుకునే ఆటల వెనుక ఇంత భయంకరమైన దృశ్యం వుందా? అందరి మనసులో ఒకటే ఆలోచన! తప్పు చేస్తున్నాం, డబుల్ మీనింగ్‌లో డబుల్ రోల్ కూడా వుందంటే, వాహినిని అంతగా క్షోభ పెట్టిందంటే ఆ లోపం తమలోనే వుందని అందరూ అంగీకరించారు.

"వాహినీ! నువ్వు చెప్పేవరకూ మేము మా ప్రవర్తన ఇంత హీనంగా, హేయంగా వుందని గుర్తించలేకపోయాం. మమ్మల్ని మేం సరిదిద్దుకుంటాం. మమ్మల్ని క్షమించు. నవ్వు ఉద్యోగంలో చేరాలి. రాజీనామా నువ్వు చేయడం కాదు. మా ప్రవర్తనకి, నడవడికి మేము రాజీనామా చేస్తూ స్వస్తి పలుకుతున్నాం" అంటూ అంతా ముక్తకంఠంతో పలికారు.

వాహిని సంతోషంగా అందరితో చేతులు కలిపింది.



## కరిష్మా బోరు కొట్టిందట

క్రితం సంవత్సరం అంతా చాలా బిజీగా వున్న కరిష్మాకపూర్ ఈ సంవత్సరం కూడా బాగానే సినిమాలు సంపాదించగల్గింది. అయితే కొరియోగ్రాఫర్ ఫరాఖాన్‌తో చైనా గార్డెన్‌లో పెట్టుకున్న చిన్న తగాదా ఇండస్ట్రీ అంతా తెలిసిపోయింది. దాంతో ఫరాఖాన్ కంటే కరిష్మాకే నష్టం ఎక్కువ కల్గింది. ఫలితంగా సాజిద్ నడియాడ్ వాలా తీస్తున్న 'హర్ దిల్ జో ప్యార్ కరేగా' నుంచి కరిష్మా తప్పకోవాల్సి వచ్చింది. అడిగితే ఇప్పటికే సల్మాన్, కరిష్మాలు జంటగా మూడు సినిమాలు వచ్చాయి కదా మళ్ళీ కరిష్మాయే అయితే జనానికి బోరు కొడుతుందేమోనని మార్చాల్సి వచ్చిందంటున్నారు సాజిద్.